Vol. II
No. 2

27th March, 1978
(Monday)
6 Chaitra, 1900 S.E.

# THE ANDHRA PRADESH
# Legislative Assembly Debates
## OFFICIAL REPORT

CONTENTS

| | PAGES |
|---|---|
| Condolence Motion: | |
| re: On demise of Sri Gunturu Bapaniah, a Member of the Andhra Pradesh Legislative Assembly | .. 71-88 |

PRINTED BY THE DIRECTOR OF [illegible]

# THE
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES,
## OFFICIAL REPORT

---

Eighth Day of the First Session of the
Andhra Pradesh Legislative Assembly.

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Monday the 27th March, 1978

The House met at Half-Past Eight of the Clock.

( Mr. Speaker in the Chair )

## CONDOLENCE MOTION

re : On demise of Sri Gunturu Bapanaiah, a Member of the Andhra Pradesh Legislative Assembly.

ముఖ్యమంత్రి (డాక్టర్. ఎమ్. చెన్నారెడ్డి) :—అధ్యక్షా, ఈ రోజు చాలా విచారకరమైన దినం. మనతోపాటు ఎసెంబ్లి సభ్యుడుగా ఉన్న శ్రీ గుంటూరు బాపనయ్యగారు మొన్న రాత్రి 11.40 గంటలకు అకాల మృత్యువు చెందడంవల్ల మన సహచరులు ఈ రాష్ట్రానికి అనేక సంవత్సరాలుగా ఎంతో నిర్మాణాత్మకమైన సేవచేస్తూ, ప్రముఖమైన పాత్రవహించిన మిత్రున్ని కోల్పోయినందుకు విచారకరమైన దినంగా భావిస్తున్నాము. శ్రీ బాపనయ్యగారు ఇంటర్ మీడియట్ చదువుతున్న కాలంలోనే ప్రజాజీవితంలోకి పిలుపునందుకొని ప్రవేశించారు. హరిజనులు అంత చదువు చదువుకుంటే పెద్ద పెద్ద ఉద్యోగాలు దొరికే ఆ కాలంలోనే దేశసేవా భావంతో, ప్రజాసేవా భావంతో ఈ రకమైన త్యాగంచేస్తూ ప్రజాజీవితంలోకి వచ్చిన మంచి ప్రజానాయకుడు, ఆయన ప్రజాజీవితంలోకి వచ్చినప్పటినుంచి కార్మికుల, ముఖ్యంగా వ్యవసాయ కార్మికులను సంఘటిత పరచి, వారి సంస్థను బలపరచి, గ్రామీణ జీవితంలో అట్టడుగున ఉన్న బాధపడుతున్నవారిని, వారి జీవితంలో ఒకరకమైన మార్పుతేవాలని పాటుపడిన ప్రముఖుడు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో ఉండి ఆ పార్టీలో చీలిక వచ్చినప్పుడు మార్క్సిస్టుపార్టీలోకి పోయారు. చాలా అఖండమైన క్రమశిక్షణతో పాటుపడేవారు. ఏ ఉద్యమం వచ్చినా చిరునవ్వుతో పాల్గొనే మనిషి. నాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించినప్పటినుంచి ఆయనతో సన్నిహితంగా పనిచేసే అవకాశం వచ్చింది. అనేక కమిటీలలోను, ఎసెంబ్లిలోనూ ఆయన ఎంతో పట్టుదలతో పాల్గొనేవారు. చాలా సౌమ్యమైన స్నేహితుడు. మంచి ప్రేమకు పాత్రుడైనటువంటి వాడు. ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ లోనో, కౌన్సిల్ లోనో ఎక్కడో ఒక ప్రక్కన ఉండి ఆయన చేస్తున్న సేవ ఇక మనకు లభించనందుకు మనకు ఎంతో బాధగా ఉంది. నేను ఇటీవల ఆయనను, కొందరు మిత్రులకు పరిచయము చేస్తూ ఆయన పేరు బాపనయ్య అని చెబుతున్నప్పుడు ఆయన ఎంతో

తమాషాగా నవ్వారు. అవన్నీ గుర్తుకువస్తే ఎంతో బాధగా ఉంది. మొన్న జబ్బు పడ్డప్పుడు కూడా నేను బాగుపడతాను ఏమైనాసరే పార్టీ నేషనల్ కన్వెన్షన్‌కు పోతాను అని చెప్పారు. సుందరయ్యగారు డాక్టరు అనుమతి ఇచ్చినా నేను ఇవ్వను అని చెప్పారు. మొన్నటినుంచి ఆయన స్థితి క్షీణించిపోతున్నదంటే నేను పోయి చూశాను. ఆయన భార్య మచిలీపట్టణంలో ఉన్నారు. సమయానికి రాలేదు. టెలిగ్రామ్ పోతే వారు ఇంకా సజీవంగా ఉండి ఉన్నా స్పృహ లేకుండా ఉన్న సమయంలో వచ్చినారు. ప్రభుత్వ పక్షంనుంచి వారికి వెహికల్ ఏర్పాటు చేశాము వారిని పిలిపించడానికి. ఈలోగానే వారు టెలిగ్రామ్ అందుకుని వచ్చినారు. మొన్న రాత్రి వారి పరిస్థితి క్షీణించిపోతున్నది. నేను చూసినప్పుడు నాకు చాలా కష్టం కలిగించింది. అటువంటి అవస్థలో డాక్టర్లు మాత్రం చివరి క్షణంవరకూ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. వారిని నిన్న ఇక్కడనుంచి పంపారు. వారు పోవడంవల్ల మనకు కలిగినటువంటి లోటు తీరనటువంటి లోటు వారి మరణం కేవలం మార్క్సిస్టు పార్టీకి నష్టం అని అనుకోను. వారిమరణం మొత్తం మన రాష్ట్రానికి, ఎసంబ్లీకి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాజీవితానికి లోటుగా భావిస్తున్నాము. పేపర్లలో వారికి 70 సంవత్సరాలని పొరబాటుగా వ్రాసినారు. ఆయన వయస్సు 59 సంవత్సరాలు. ఆయన 1919 లో జన్మించారు. ఎక్కువ వయస్సుగల వాడని చెప్పడానికి వీలులేదు. అందుకనే వారి మరణం చాలా బాధగా ఉంది. ఈ సందర్భంగా నేను సంతాపం తెలుపుతూ, మొత్తం హౌసు పక్షాన మన సానుభూతిని వారి భార్యకు, కుటుంబసభ్యులకు తెలుపుతూ ఈ తీర్మానాన్ని హౌసుముందు ప్రవేశపెడుతున్నారు.

Sir, I beg to move: That this House places on record its deep sense of sorrow at the demise of Sri Guntur Bapanaiah, a member of the A.P. Legislative Assembly and conveys its sense of sympathy to the members of the bereaved family.

Mr. Speaker: Motion moved.

8-40 a.m. శ్రీ గౌతు లచ్చన్న (సోంపేట) :— అధ్యక్షా, బాపనయ్యగారు చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నారనే వార్త 25వ తేదీన ఉదయం పత్రికలలో రాగానే, అది చూసిన వెంటనే నేను హాస్పిటల్‌కు వెళ్ళి వారిని చూడడం జరిగింది. వారిని చూసిన డాక్టర్లు లాభము లేదనే పరిస్థితిని తెలియజేశారు. బాపనయ్యగారితో నాకు గత మూడు దశాబ్దాల నుంచి పరిచయం ఉంది. రాజకీయ రంగములో, సిద్ధాంత రీత్యా పరస్పర విభేదాలు, వైరుధ్యాలు ఏమి ఉన్నప్పటికి ఆయన ప్రజా సేవ, జీవితములో వారు చూపించినటువంటి సునిశితమైన ఒక దీక్షను, ఒక క్రమశిక్షణను. కార్యదీక్షను మనము చాలా కొద్ది మందిలో మాత్రమే చూడగలుగుతాము అని నా విశ్వాసము, ఆ మనిషి నిష్కళంకమైన, నిస్వార్థమైన సేవాపరుడని చెప్పడంలో నాకు ఎలాంటి సందేహము లేదు. స్వాతంత్ర్య పోరాటం సందర్భములో, ఈ స్వాతంత్ర్యము ఎవరికి ఉండాలి అనే విషయంలో ఒక సునిశితమైన భావానికి, ఒక సిద్ధాంతానికి కట్టుబడి స్వాతంత్ర్యానికి ముందే ఆ దీక్షతో అట్టడుగున పడి

ఉన్న హరిజన, గిరిజన, బడుగు వర్గాల ఉద్ధరణకై ఈ స్వాతంత్ర్యము కావాలనే దీక్షతో పని చేసిన కార్యదక్షుడు ఆయన. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత కూడా పేద ప్రజల యొక్క సమస్యల పరిష్కారానికి అనేక పోరాటములు నడిపిన వ్యక్తి ఆయన. ఆయన పట్టుదల కలిగిన మనిషి. తీవ్రమైన భావాలు కలిగిన విప్లవ నాయకుడు అయినప్పటికి మన ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు సామ్యవాదములో, సంఘటితములో, సంభాషణలో ఆయనకు ఉన్నటువంటి సరళ భావము, సౌమ్యత గురించి మనము ప్రత్యేకంగా అభినందించవలసియున్నది. ఆయన నీతినిజాయితీ కలిగి నిష్కలంకమైన ప్రజాసేవ, దేశసేవ చేయడం వల్ల ఒక్క పేద ప్రజలకే కాకుండా అన్ని వర్గాల యొక్క ప్రేమను, అభినందనలను చూరగొన్నటువంటి వ్యక్తి. అటువంటి కార్యదక్షుడు, ఒక పటుత్వం, పట్టుదల, దీక్ష కలిగిన ప్రజా సేవకుడు ఇప్పుడు మన మధ్య లేకుండా పోవడం మన రాష్ట్రానికే కొరత అని చెప్పడంలో సందేహము లేదు. సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానమును నేను మా జనతా పార్టీ తరపున బలపరుస్తూ వారి ఆత్మకు శాంతికలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి మా ప్రగాఢసంతాపాన్ని అందజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ భాట్టం శ్రీరామమూర్తి (పరవాడ) :— అధ్యక్షా, నాకు బాపనయ్య గారితో దాదాపు 20 సంవత్సరాల నుంచి పరిచయం. శాసనసభా సభ్యులుగా, శాసన మండలి సభ్యులుగా ఆయన ఆంధ్రప్రదేశ్‌కు అనేక రంగాలలో కృషి చేశారు. పీడిత ప్రజల సముద్ధరణ కోసమై నిత్య కంకణము, నడుము కట్టుకొని ఎన్నో విధాల పనిచేస్తూ వచ్చినటువంటి ప్రజాసేవకుడు ఆయన. బాపనయ్యగారు ఎంతో సౌమ్యుడు, ఎంతో ఉత్తముడు, ఆదర్శ ప్రజా సేవకుడు, నిస్వార్థ నిష్కలంక ప్రజా సేవకుడు, ఉత్తమ దేశ భక్తుడు. అనేక రంగాలలో వారు చేస్తున్న కృషితో ప్రత్యక్షముగా నాకు కొంత సంబంధము ఉంది. ఎన్నో కమిటీలలో మేము కలిసి పనిచేశాము. ఆదర్శాలలో ఎంత పట్టుదల ఉందో కార్యక్రమాల యందు అంత దీక్ష ఉంది, మనిషితో వ్యక్తిగతమైన సంబంధాలలో అంత అమాయకత్వము ఉంది. అంతటి ప్రేమతత్వము కూడా ఉంది. పేద ప్రజల తరఫున పాటు పడాలని ప్రతినిత్యము తహతహలాడే మనిషి. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా, శాసనసభ, శాసన మండలి సభ్యులుగా ఆయన ఈ రాష్ట్రానికి, పేద ప్రజలకు సామ్యవాద సమాజ నిర్మాణానికి అకుంఠితమైన సేవ చేశారు. ఎనలేని సేవచేశారు. ఆయన ఆకస్మికంగా మరణించడం పట్ల, కాంగ్రెసు పార్టీ తరఫున సభానాయకుడు ప్రవేశపెట్టిన తీర్మానమును సంపూర్ణముగా సమర్థిస్తూ వారి కుటుంబానికి మా ప్రగాఢ సంతాపాన్ని తెలియబరుస్తూ వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ పి. సుందరయ్య (గన్నవరం) :— అధ్యక్షా, కామ్రేడ్ గుంటూరు బాపనయ్య తాను చదువుకుంటున్నప్పుడే హరిజనులు, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ముందుకు వచ్చి రాజకీయ రంగములో ప్రముఖ పాత్ర వహిస్తే తప్ప మన దేశమునకు స్వాతంత్ర్యము స్వాతంత్ర్యము తదనంతరము జనతా ప్రజా

8-50 a. m. స్వామ్యము సోషలిజము రాదని కమ్యూనిస్టుపార్టీలో చేరి పనిచేయాలనే ఉద్దేశముతోనే రాజకీయాలలోకి రావడం జరిగింది ముఖ్యమంత్రి గారు అన్నట్లు ఆ మాత్రము చదువుకుంటూనే ఎన్నో పెద్ద పదవులు దొరకడం తేలికగా ఉన్న రోజులని. వారి బంధువులు చదువుకొని పెద్ద ఉద్యోగాలు చేయండని ఆయనను ఒత్తిడి చేశారు. కాని ఆయన ఎన్నో పెద్ద ఉద్యోగాల కన్నా పెద్ద ఉద్యోగము అట్టడుగున ఉన్నటువంటి హరిజనులు, పేద ప్రజలు - ముఖ్యంగా హరిజనులకు సేవ చేసి వారిని సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తేవడానికి తన శక్తిసామర్థ్యాలు వినియోగించాలన్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో ఉంటూనే సేవ చేయడం జరిగింది. తరువాత 1939 నుంచి మొన్న చనిపోయేవరకు ఎప్పుడు కూడా వెనుకంజ చేయకుండా ప్రలోభాలకు గురి కాకుండా నిరంతరము ప్రజా సేవ చేయడానికి ఆయన తన జీవితాన్ని వినియోగించారు. అది మాకు ఎంతో ఆదర్శము. మమ్ములను ఎంతో ఉత్సాహపరచింది. నాతోపాటు పని చేస్తూ ఉన్నటువంటి అగ్రకులాలకు చెందిన చల్లపల్లి నారాయణ రావుగారి లాంటి వారు నా కన్నా చొరవగా హరిజనులకు సేవ చేయడానికి చొచ్చుకుపోతున్నారని ఆయన చెపుతూ ఉండేవారు. అటువంటి నాయకులను కోల్పోయాము, ఏమయినా మనకు మిగిలిన కర్తవ్యము. వారి యొక్క ఆశయాలను సాధించే దాకా మన జీవిత కాలములో సాధించినా, సాధించకపోయినా కనీసం ఆ ఆశయాల కోసం జీవితాన్ని వినియోగించడం కోసం నిలబడతానని చెప్పారు. అదే రీతిగా సిద్ధాంత రీత్యా అనేక రకాలుగా ఎన్నో భేదాభిప్రాయాలు వచ్చినా, ఎన్ని చిక్కులు వచ్చినా ఒకటే మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలో ముఖ్య నాయకుడుగా వచ్చి పనిచేయడం జరిగింది, నాకు వారితో దాదాపు 1939, 1940 నుంచి కలిసి పనిచేసే అవకాశం జరిగింది. మాకు వారు ఎన్నో సలహాలు ఇవ్వడం జరిగింది మేము కొంచెము ముక్కుకు సూటిగా పోయినా ఆయన హరిజనుల, పేదప్రజల సేవకు వారికి ఉన్న సమస్యలను మా పార్టీ దృష్టికి తీసుకురావడం, వాటి నిర్ణయాల విషయంలో ఎంతో తోడ్పడుతూ ఉండడం జరిగింది. మేము ఎంతో గర్వపడుతూ ఉండే వారము. ఆయన కేవలం హరిజన నాయకుడు మాత్రమే అనడం సరయినది కాదు. వెనుకబడిన కులాల నుంచి పై కులాల నుంచి వచ్చిన రైతులకు ఆయన మీద చాలా గౌరవము. ఆయన పేద హరిజనులు, వెనుకబడిన జాతులవారు రాజకీయంగా రావలసినంత ముందుకు రావడం జరగలేదని బాధపడుతూ ఉండేవారు. మన దేశములో జనతా ప్రజా స్వామ్యము సాధించేందుకు 1955 లోనే పార్టీలో ఏమి చేయాలని నిరంతరము ఆయన ఆందోళన పడుతూ ఉండేవారు గత ఆరేళ్లగా వారి ఆరోగ్యం సరిగా లేదు, మూత్రపిండాలు, గుండె జబ్బు, బ్లడ్ ప్రెషర్, మదుమేహం యివన్నీ వున్నాయి. ఎంత జాగ్రత్తలు తీసుకుంటూకుంటున్నప్పటికీ, ప్రజా సమస్యలు వచ్చినప్పుడు, అందులో పాల్గొనడం జరుగుతూ వచ్చింది. మొదటి పార్లమెంటు ఎన్నికలలో వారిని నిలబెట్టడానికి మేము వెనుకంజ

వేశాము. తరువాత, యీ ఎన్నికలలో నిలబెట్టడానికి కూడా మేము వెను కంజ వేశాము. కాని, రాజకీయంగా. ప్రజా ఉద్యమాలలో యిటువంటివి తప్పని సరి అవుతూవుంటాయి. శాసనసభలో-యీ రోజున వున్న పరిస్థితుల ప్రకారం- కొద్ది మందిని మాత్రమే మేము రాగలము అనుకున్నాం. ఎక్కువ మందిమి వస్తామని అనుకోలేదు. ఇటువంటి వ్యక్తులు గనక వుంటే, యీ శాసనసభ ద్వారా, ప్రజా ఉద్యమాలకు, దేశానికి ఎంతో సేవ చేయగలరని వారిని నిలబెట్ట డం జరిగింది. ఎన్నికలు జరిగిన తరువాత, సరిగ్గా ఒక మాసానికి - మార్చి 25 రాత్రి 11-45 గం.లకు వారు చనిపోవడం జరిగింది. 20వ తేదీ ఉదయం నేని క్కడ కూర్చునివుండగా, ఇక్కడకు వచ్చి. సుందరయ్యగారూ నేను హాస్పిటల్‌లో చేరుతున్నాను, మళ్ళీ యీ సెషన్‌కి రాలేనేమో. నిన్న డాక్టర్ సత్యనారాయణ గారి వద్దకు వెళ్ళి సలహా తీసుకుంటే వెంటనే హాస్పిటల్‌లో చేరమని చెప్పారు - అన్నారు. నిన్న ఉదయమే చెబితే యీ ఉదయం వరకు ఎందుకు ఆలస్యం చేశా రని ఆయనవద్ద వున్న చనువుతో నేను కోప్పడ్డాను. ఆ తరువాత డాక్టర్సు-పర్వా లేదు, సకాలంలోనే హాస్పిటల్‌లో చేరారు-అన్నారు. 22 ఉదయం, ముఖ్య మంత్రిగారు చెప్పినట్లుగా, పార్టీ కాంగ్రెసుకు, డాక్టర్సు ఆయనను పోగూడదని చెప్పడం, వారిని శ్రమపెట్టకూడదనుకోవడం, 24వ తేదీ నాటికి ఆయన పరిస్థితి క్షీణిస్తున్నదని యిక్కడనుంచి వార్త రావడం జరిగింది. గంట గంటకు మా కార్యకర్తలు, డాక్టర్సు పరిస్థితిని తెలియజేయడం జరిగింది. ఆ తరువాత పరిస్థితి ఆందోళనకరంగా వున్నదని, శస్త్రచికిత్స కొరకు ప్రయత్నిస్తున్నామని, అది సాధ్య మైతే కొంత అవకాశం వుంది, లేకపోతే మేము చేయగలిగిందేమీలేదని ఆ సాయంత్రం డాక్టర్సు తెలియజేశారు. ఆ తరువాత శస్త్రచికిత్స ఆరంభించారనే వార్త వచ్చింది. కాని రాత్రి 12 గంటలకు ఏ క్షణములోనయినా చనిపోతా రని, తెల్లవారే వరకు బ్రతికే ఆశ లేదని డాక్టరు గారు స్వయంగా ఫోన్ చేయ డంతో బయల్దేరి వచ్చాము. కాని, నేను వచ్చేటప్పటికే వారు చివరి క్షణాలలో వున్నారు. ఆ తరువాత మరణించారు. ఈ సందర్భంలో అ స్పెషాలిటీస్‌కు సంబంధించిన డాక్టర్సు-హార్ట్ - సత్యనారాయణగారు, న్యూరో సర్జన్ వీరరాఘవ రెడ్డిగారు, సర్జరీ బాల పరమేశ్వరరావుగారు వీరందరూ ఎంతో శ్రద్ధతో. దాదాపు పేషెంటు దగ్గర ఉదయం నుంచి సాయంత్రం దాకా వుండి సేవ చేశారు. ఈనాడు దేశ రాజకీయ, యితర పరిస్థితుల దృష్ట్యా యిలాంటి అవాంతరాలు వచ్చినప్పుడు డాక్టర్స్ సరిగా చూడలేదని అభిప్రాయం సాధారణంగా ప్రజలలో కలుగుతూవుంటుంది. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. అందరి విషయంలోనూ యిలాగే డాక్టర్స్ చూస్తూఉంటే ఇలాంటి అపవాదు ప్రజలలో రావడానికి అవకాశముండదు. ఏమైనప్పటికి అందరిని ఎలా చూశారోగాని మా పార్టీతరపున ఆ డాక్టర్స్ అందరికికూడా, వారు చూపిన శ్రద్ధకు, చేసిన వైద్యచికిత్సకు మా కృతజ్ఞత తెలియచేస్తున్నాను. అదేవిధంగా అక్కడవున్న స్టాఫ్ కూడా ఎంతో బాగాపనిచేశారు. చనిపోయిన తరువాత ప్రభుత్వం వివిధ పార్టీనాయకులు మంత్రులు హాస్పిటల్‌లో వారి

ప్రమాదపరిస్థితిలో వుండగావచ్చి చూడడమేగాక చనిపోయినప్పుడుకూడ వచ్చి చూశారు. గుంటూరు బాపనయ్యగారు ఒక పార్టీకి చెందిన వ్యక్తి అనిగాక స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని పోరాడినవారు దేశప్రజలకు సేవచేసిన ఒక ప్రముఖనాయకుడిగా గుర్తించి వారిగురించి తమ అదుర్దాను తెలియచేసినందుకు మేము ఎంతో గర్వపడుతున్నాం. మా కార్యకర్తలు. మా నాయకులు అందరూకూడా రాజకీయంగా కఠినంగా, ఖచ్చితంగా వుండాలని, ఏమాత్రంకూడా తొణక్కుండా వుండాలని, నిత్యజీవితంలో దేశ సేవారంగంలో అందరి మన్ననలను సంపాదించుకునేవిధంగా మెలగాలని మాఆశయం. ఆవిధంగా నడచినవారు కామ్రేడ్ బాపనయ్యగారు. ఆయన పోయిన తరువాత అడిగీ అడగంగానే వెనువెంటనే ప్రభుత్వం వెహికల్ యిచ్చి తోడ్పడింది. ఆ సహకారం లేకపోతే కొంత యిబ్బందిఅయ్యేది, మీరుస్వయంగా ఈ సహకారం వెనువెంటనే చేశారు. ఈ ఊరుదాటిన తరువాత నార్కెట్‌పల్లి వద్దగాని, అనేకస్థలాల్లో అప్పటికప్పుడు వేలకొలది ప్రజలువచ్చారు. చల్లపల్లివద్ద మేము నిర్మించిన అమరవీరుల స్తూపమువద్ద ఆయనను దహనం చేయడం జరిగింది, వేలసంఖ్యలో అక్కడకూడ వారిని చూడాలని ప్రజలు వచ్చారు. లారీఎక్కితే యింకకదలడం సాధ్యం కాదని నేను చెప్పినప్పటికి బ్రతిమిలాడినప్పటికి ప్రజలు ఆయనపైవున్న విశ్వాసం గౌరవంఎంతో చూపించారు. ఆ సందర్భంలో మాపార్టీపై వున్న అభిమానంకూడా ఎంతోకనబడింది. ఇలాంటి కార్యకర్త మాపార్టీలో 40 ఏళ్ళుగా పనిచేసినందుకు మేము ఎంతో గర్వపడుతున్నాం. ఈనాడు కామ్రేడ్ గుంటూరు బాపనయ్యగారు, మాపార్టీలోవున్న కొద్దిమందితోపాటుగా నిలబడి ఈ శాసనసభా వేదికను వుపయోగించుకుని పనిచేస్తారని ఆశించాము, వారు పోవడంతో మాపై అదనంగా బాధ్యతపడింది. ప్రజలు మాపై మోపిన కర్తవ్య నిర్వాహణలో ప్రజా సేవచేయడానికి శాసనసభా వేదికనుంచి ప్రభుత్వంతో పనులు చేయించడానికి వీటన్నిటికి సంబందించి పూర్తిబాధ్యత మాపైబడింది, ఆబాధ్యతను గుర్తించి వారి జీవితము వారి సంస్కృతి మనసులో పెట్టుకుని వివిధ పార్టీలవారు వారిపై చూపిన అభిమానాన్ని దృష్టిలోపెట్టుకుని మరింత ఉత్సాహంతో, ధైర్యంతో ఆయన ఆందోళన పడుతూ ఉండే వారు. ఆశయాలను సాధించడానికి మా పార్టీకృషి చేస్తుందని, వారికి మా జోహార్లు అర్పిస్తూ సభానాయకుడిగా ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను. సెలవు.

శ్రీ పి హెచ్. రాజేశ్వరరావు (సిరిసిల్ల) :—అధ్యక్షా, కామ్రేడ్ గుంటూరు బాపనయ్యగారి అకాల మరణంపట్ల సభా నాయకులు, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, వారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో, ప్రతిపక్ష నాయకులు కామ్రేడ్ సుందరయ్యగారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో మా పార్టీ తరఫున ప్రగాఢమైన సానుభూతిని, సంఘీభావాన్ని ప్రకటిస్తూ గుంటూరు బాపనయ్యగారికి జోహార్లు అర్పిస్తున్నాను.

అధ్యక్షా, కమ్యూనిస్టు ఉద్యమంలో, ఆంధ్ర రాష్ట్రంలో చాలా పెద్ద పోరాటాలు జరిపి, చాలా పెద్ద ప్రజా ఉద్యమాలు నిర్మించి, ఒక బలమైన కమ్యూనిస్టు ఉద్యమంగా అవతరించిన విషయం దేశభక్తులందరికి తెలుసు. ఈమధ్య కాలంలో చీలిపోయినప్పటికి, మొదటినుంచి పేద ప్రజలలో, హరిజనులలో వేళ్ళూనుకుని, ప్రజా సమస్యలకు సంబంధించి ఎన్నో త్యాగాలు చేసి, పోరాటాలు జరిపి, ఆ మహోద్యమంలో పాల్గొని, శాసనసభా వేదికలోనయితేనేమి, ప్రజల మధ్య వుండి పని చేయడంలోనయితేనేమి, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో నాయకత్వం వహించడంలోనైతేనేమి అనేక త్యాగపూరిత ఘట్టాలు కామ్రేడ్ గుంటూరు బాపనయ్యగారి జీవితంలో వున్నాయి. అవన్నీ యీనాడు కమ్యూనిస్టులకేగాక, దేశ భక్తులందరికీ, ముఖ్యంగా యువతరానికి ఆదర్శప్రాయంగా ఉంటాయనడంలో నాకు అనుమానం లేదు. నాకు వారితో 1948 నుంచి—30 ఏళ్ళుగా పరిచయం వుంది. మొన్న వారు సుందరయ్యగారి వద్దకు వచ్చి హాస్పిటల్ కు పోతున్నాను అని చెబుతుంటే వారి అనారోగ్య పరిస్థితి చూసి చాలా బాధపడ్డాను. మళ్ళీ తిరిగి వస్తారా అని ఆందోళన పడ్డాను. అనుకున్న ప్రమాదం జరిగింది. త్వరగానే వారి ఆరోగ్యం క్షీణించి వారు మన మధ్యనుంచి వెళ్ళిపోయారు. ఇది ప్రకృతిసిద్ధం; చింతిస్తాము, బాధపడతాము, ఎవరూ తప్పించులేని వాస్తవమిది. అయితే, గుంటూరు బాపనయ్యగారు ఏ ఆశయాల కొరకు పోరాడారో, ఎంత త్యాగంతో నిజమయిన ప్రజాస్వామ్యం, నిజమైన సామ్యవాదం ప్రజా పోరాటాలద్వారా సాధిద్దామనుకున్నారో, యీ ఆదర్శాలు కమ్యూనిస్టులకేగాక, దేశభక్తులందరికి ప్రజాస్వామ్యవాదులందరికి మార్గదర్శకంగా ఉండగలవని నమ్ముతూ వారికి, వారి కుటుంబానికి మా పార్టీతరపున నా సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

شری سلطان صلاح الدین اویسی (چار مینار) :— جناب اسپیکر صاحب - ایوان میں جو قرارداد تعزیت شری جی - باپنیا کے انتقال پر پیش کی گئی ہے اس تعلق سے میں اپنی اور اپنی پارٹی جانب سے بڑے دکھ اور افسوس کا اظہار کرتا ہوں کہ ایک اچھے آدمی ہم سے جدا ہوگئے ہیں - میں اپنی اور اپنی پارٹی کی جانب سے اس قرارداد تعزیت کی بھر پور تائید کرتے ہوئے ہمدردی کا اظہار کرتا ہوں -

శ్రీ ఎమ్. ఓంకార్ [నరసంపేట]:— అధ్యక్షా, మా పార్టీ ప్రముఖ నాయకులలో ఒకరు కామ్రేడ్ బాపనయ్యగారి అకాల మరణానికి సంతాపాన్ని తెలుపుతూ సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. సభా నాయకులైన ముఖ్యమంత్రిగారు చాల వివరంగా వారియొక్క సేవను ఉగ్గడించారు. మా పార్టీ నాయకులైన కామ్రేడ్ సుందరయ్యగారు మొదటి నుంచి వారితో ఉన్న పరిచయాన్ని దృష్టిలో పెట్టుకొని వారియొక్క సేవల గురించి యిదిగా చెప్పారు. మొత్తం మీద మాట్లాడడమే కష్టమైన 9-00 a.m.

విషయంగా వున్నది. నిన్న ఈ విషాదకరమైన వార్త నెల్లూరులో పార్టీ కాన్ఫరెన్స్‌లో ఉండగా తెలిసినప్పుడు కంట నీరు పెట్టనటువంటి వారు ఎవరమూ లేము. ఈ రాష్ట్రంలో కేవలం మార్క్సిస్టు కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించిన నాయకుడు పోవడం పార్టీకే నష్టం అని కాకుండా ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా తెలుగు ప్రజలకే కాకుండా దేశ ప్రజలకే చాల తీవ్రమైన నష్టం. ఈ నష్టాన్ని ప్రజా ఉద్యమం తిరిగి ఎంత కాలానికి పూడ్చుకుంటుందో చెప్పడం కష్టమైన విషయం. మానవులు చావడం అనేది సహజమైన స్థితి అయినప్పటికి జిల్లాలో ఆ యా ఉద్యమాలలో, ఆ యా వ్యక్తులకు వచ్చిన నష్టాన్ని మరల భర్తీ చేయడం అనేది తేలికైన సమస్య కాదు. ఇది ప్రజానీకానికి చాల నష్టమైన సమస్య. నేను ఈ సందర్భంలో తీవ్రమైన హృదయావేదనతో వారి మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ ముగిస్తున్నాను.

ఒక గౌరవ సభ్యుడు:—

అధ్యక్షా, బాపనయ్యగారు హరిజన నాయకులు. హరిజన కుటుంబంలో జన్మించిన వారి ఆకస్మిక మరణం పట్ల రాష్ట్రంలో గల హరిజన బలహీన వర్గాల ప్రజల యొక్క గాఢ విచారాన్ని వ్యక్తం చేస్తున్నాము. వారు దేశంలో దళిత వర్గాల ప్రజల యొక్క సంక్షేమం గురించి ఎంతో కృషి చేసిన మహానాయకులు. అట్టివారు ఈ రోజున ఈ సమస్యలు తీరకమునుపు అస్తమించడం ముఖ్యంగా దళిత వర్గాల ప్రజలయొక్క దురదృష్టం అని చెప్పక తప్పదు. అటువంటి మహా నాయకులు మా హరిజనులను, దళిత వర్గాల ప్రజలను వీడి స్వర్గాన్ని అలంకరించినందుకు రాష్ట్రీ హరిజన, గిరిజన బలహీన వర్గాల ప్రజల తరఫున సంతాపాన్ని తెలియజేయుచున్నాను. విచార సముద్రంలో మునిగిపోయిన వారి కుటుంబానికి మా సానుభూతి అందజేస్తూ వారి ఆత్మకు భగవంతుడు సదాశాంతిని కలుగజేయాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎమ్. వి. కృష్ణారావు [అవనిగడ్డ]:— అధ్యక్షా. గుంటూరు బాపనయ్యగారు నా ప్రక్క నియోజక వర్గం 'నిడుమోలు' నుంచి శాసనసభకు ఎన్నికైనారు. వారు వ్యవసాయ కూలీల ఉద్యమం, ముఖ్యంగా పేద ప్రజల తరఫున అనేక పోరాటాలు ఆ ప్రాంతంలో జరిగినాయి. ఆయన ఆశయాలు కొంచెం ఉగ్ర రూపాన ఉన్న మనిషి. సౌమ్యుడు. స్నేహశీలి. పార్టీ రీత్యా బేధం ఉన్నప్పటికి ఎంతో స్నేహంగా ఉండేటటువంటి వారు, చాల సౌమ్య శీలుడు. ముఖ్యంగా పేదవారి యొక్క సమస్యలను పరిష్కారం చేయడంలో, ఆయన చాల అందె వేసిన చేయి. సమస్యను అధికారుల దగ్గరగాని, పోరాటం ద్వారా గాని పరిష్కారం చేయాలనే ఆతృత వున్నది. నిజంగా ఈ సమయంలో అటువంటి వ్యక్తి పోవడం ఆ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు ఎంతో దెబ్బ అని మనవి చేస్తున్నాను. మన అసెంబ్లీలో ఉన్నప్పుడే మనిషి కొంచెం సుస్తీగా ఉంటే, ఆస్పత్రిలో జాయిన్ అయి రెండు నెలలు రెస్టు తీసుకోండి. ఎన్నికలలో శ్రమపడి ఉన్నారని అన్నాను. వారు వెడతాను అన్నారు. ఆస్పత్రికి వెళ్లె రోజున

నాకు లాబీలో కనబడ్డారు. చాల నీరసంగా ఉన్నారు. ఆస్పత్రికి వెడుతున్నానని చెప్పారు. ఇంత త్వరగా మనలను వీడి వెడతారని దురదృష్టవశాత్తు ఈనాడు వారు మనలో లేరు. అటువంటి మంచి మనిషిని కోల్పోవడం పార్టీకే కాకుండా శాసనసభకు, ప్రజలకు కూడ తీరని లోటు. వారి కుటుంబానికి నా హృదయ పూర్వకమైన సానుభూతి తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. వెంకట్రావు (నూజివీడు) :— అధ్యక్షా, బాపనయ్యగారు నేను కలిసి నాలుగు సంవత్సరాలు పాటు కౌన్సిల్‌లో మేంబర్స్‌గా ఉండడం జరిగింది. కృష్ణా జిల్లాలో ఏ ఊరు వెళ్ళినా బాపనయ్యగారిని తెలియనటువంటి వారు ఉండరు. దేశ రాజకీయాలలో ఆర్థికమైన నీతి వెనకపడుతున్న రోజున కూడ ఎంతో బీదతనంలో పుట్టి ఈ రోజున అదే బీదతనంలో ఆయన చనిపోవడం జరిగింది. ఆయన నిలబడ్డ ఆదేశం ఆయన నిలబడ్డ రాజకీయం ఏదైనా ఆయన రాజకీయంగా గత 30 సంవత్సరాలుగా కృష్ణా జిల్లాలో కార్యరంగంలో ఉండి నడుపుతున్న పోరాటాలు చూస్తే ఏ పార్టీకి భేధాభిప్రాయం ఉండేవి కావు. ఆయన ఒక్క హరిజన నాయకుడే కాదు. రైతులకు అతి దగ్గరలో ఉండి, వారి యొక్క 9.10 a.m.
బాధలను ఈయన కార్యక్రమాలుగా రూపొందించుకుంటూ వారికి సహాయం చేస్తూ ఉండేవారు.

నాకు తెలిసినంతవరకు బాపనయ్యగారు ఒక్క హరిజనులకే కాకుండా రైతులకు, కార్మికులకు అందరకూ కూడ నాయకుడిగా వుండి పోరాటము చేసిన పరిస్థితి వుంది. గత 7, 8 సం. లుగా వారిని నేను జిల్లాపరిషత్తు సమావేశాల్లో గాని, ఇక్కడగాని చూడడము జరిగింది. ఆయన పోరాటము నడిపినా పోరాటంలో వుండేది కాదు, ఎంతో ప్రశాంతముగా, ముక్కుకు సూటిగా, నిజాయితీతో లక్ష్యాన్ని చేరుకోడానికి పనిచేసే కార్యకర్తగా నిలబడేవారు. శాసనమండలిలో సభ్యత్వము అయినతరువాతకూడ కలెక్టరు దగ్గరకో, జిల్లాపరిషత్తుకో వెళ్ళినపుడు కలుస్తూ వుండేవారు. ఒక చెట్టుక్రింద కూర్చొని సామాన్య కార్యకర్తగా పని చేస్తూ వుండే వ్యక్తి. పార్టీలు అనేవి ఆయన జీవితములో చాల చిన్న విషయము. పార్టీలకు అతీతముగా పెరిగిన వ్యక్తి ఆయన, కొత్తగా వచ్చిన యువకులు పార్టీలోవున్నా వారు మార్గదర్శకుడు అని చెప్పవలసి వుంటుంది. వారి నీతి, నిజాయితీలు కొలవడానికి ఏమీ అవకాశము లేదు. ముఖ్యమంత్రిగారికి ఒక విషయాన్ని మనవిచేస్తున్నాను. ఇది ఇదివరకు ఉభయసభల్లోను వచ్చింది. రిటైర్ అయిన గౌరవ సభ్యులకు పెన్షన్ యివ్వడం ఎట్లాగూ వుందనుకోండి. బాపనయ్యగారు బీదవానిగా పుట్టారు. బీదవానిగానే చనిపోయారు. నీతి, నిజాయితీలతో పని చేసిన మహానుభావులు చాలమంది వున్నారు. అలాంటివారిని కాపాడవలసిన బాధ్యత మనమైన వుంది. ఆర్థిక దుస్థితినుంచి బయటపడటానికి ప్రభుత్వం ఏదైనా చేస్తే వారి కుటుంబము నిజాయితీతో బ్రతకడానికి దైర్యం వస్తుందనుకొంటున్నాను. అందుకు

ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకోవాలని మనవి చేస్తున్నాను. బాపనయ్యగారి కుటుంబానికి నా సానుభూతి తెల్పుతూ, వారి ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగ చేయాలని కోరుతూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ యం. వి. యస్. సుబ్బరాజు (కొత్తపేట) :—అధ్యక్షా, జన్మతోపాటు మరణము తప్పదు. స్వాతంత్ర్యసమర కాలమునుంచి నేటివరకుతన యావజ్జీవితాన్ని రాజకీయాలకు అంకితము చేసిన వ్యక్తి బాపనయ్యగారు, తను నమ్మిన సిద్ధాంతాలకు అంకితము చేసిన మహానుభావుడు, ప్రజాసేవకుడు. బాపనయ్యగారి మరణము చాల విచారాన్ని కలుగచేస్తున్నది. శ్రీ బాపనయ్యగారితో నాకు సుమారు రెండు దశాబ్దాలుగా సన్నిహితమైన పరిచయము వుంది. మేమిద్దరము శాసనసభలోను, శాసన మండలిలోను సభ్యులుగా వుండే అవకాశము కలిగినది. ఏ రాజకీయ పక్షములో వున్నప్పటికి ఎటువంటి అరమరికలు లేకుండా చాలా అప్యాయతతో ప్రజా సమస్యలను ఆలోచించే అలవాటు వారికి వుండేది. తాను నమ్మిన మార్క్సిజం సిద్ధాంతాలకు తన జీవితాన్ని అంకితము చేసి, ప్రజా ఉద్యమాలను నిర్వహించడానికి ఆయన చేసిన సేవ అపూర్వము. తాను రాజకీయాలలో శాసన సభ్యునిగా వున్నా నైతిక విలువలకు ప్రాధాన్యత యిచ్చి జీవితాంతము వరకు పని చేసిన మహానుభావుడు. అటువంటి బాపనయ్యగారికి జబ్బు చేసినదని పేపరులో చదవగానే హాస్పిటల్ కి వెళ్ళాను. మేము వెళ్ళే సమయానికే వారు స్పృహలో లేకుండిరి. ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ఇస్తున్న సమయములో వారిని చూశాము. వారు శాసనసభ్యునిగా ఎన్నికైన నెలరోజులలోనే అసువులు బాసి, మన అందరి సానుభూతిని పొందగలిగిన వ్యక్తి. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగ చేయాలని కోరుతూ, వారికుటుంబానికి నాసానుభూతిని తెల్పుతున్నాను.

శ్రీ యస్. అల్వార్ దాస్ (విశాఖపట్టణం-1) :—అధ్యక్షా, గుంటూరు బాపనయ్యగారు తమ జీవితమంతా ప్రజాసేవలోనే గడిపారు. నైతిక విలువలను కాపాడుకొంటూ తదేక దీక్షతో ప్రజాసేవ చేసే రాజకీయ వాదులు చాలా అరుదు. వారు లేని లోటును పూడ్చలేము. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. నిజమైన ప్రజాసేవకునికి జీవితము కొవ్వువత్తిలాంటిది. ప్రపంచానికి వెలుగును యిస్తు తమను నాశనము చేసుకుంటారు. అందులోనే వారికి సంతోషము, ఆనందము వుంటాయి. అటువంటి వారిపైన ఆధార పడిన కుటుంబ సభ్యులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వముపైన ఉంది. అట్లా ప్రభుత్వము ఆదుకొన్నప్పుడే నైతిక విలువలను కాపాడుకొంటు తదేక దీక్షతో ప్రజాసేవ చేయడానికి ప్రతి వారికి ధైర్యము వస్తుంది. సైన్యములో పని చేసే సైనికునికి కుటుంబాన్ని ఆదుకొంటారనే ధైర్యము ఎట్లా వుంటుందో అట్లాగే రాజకీయ వాదుల విషయంలో కూడ ఏర్పాటుచేయాలి. మన ముఖ్యమంత్రిగారు ఎంతో ఉదారస్వభావముతో ఈ సభను వాయిదా వేయాలని కోరినారు. వారి ఉదార స్వభావానికి, విశాల హృదయానికి ఇది

నిదర్శనము. గత 3 రోజులనుంచి పండుగల పేరుతో మనము శలవు తీసుకొన్నాము ఎంతో ప్రజాధనాన్ని వ్యయము చేశాము. మరల ఈ రోజు బాపనయ్యగారి సంస్మరణార్థము సభను వాయిదా వేస్తే నిజమైన ప్రజాసేవ వారిని చూసి పరిహసిస్తుందేమో అనుకుంటున్నాను. కనుక ఇప్పుడు వాయిదా వేసి మరల 2 గంటలకు సభను మొదలుపెట్టి ఇవాళ్టి కార్యక్రమాన్ని పూర్తి చేస్తే బాగుంటుందని మనవి చేస్తున్నాను. బాపనయ్యగారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలుపుతూ, వారి ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగచేయాలని కోరుతున్నాను.

శ్రీ బి. నిరంజనరావు (మల్లేశ్వరం):—అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానమును బలపరుస్తూ, బాపనయ్యగారు, మేమందరము ఒకేచోట వుండడము, మాకు తెలిసిన విషయములు చెప్పడము అవసరం అనుకుంటున్నాను. వారు వ్యవసాయ కూలీలకే కాకుండా రైతులకు కూడా చాల సన్నిహితముగా వుండేవారు. సమర్థులు, పెద్ద రైతులు కూడా బాపనయ్యగారి దగ్గరకు పోయి తగాదాలు, పెండ్లి ముచ్చట్లు చెబుతూ పరిష్కారము పొందుతూ వుండేవారు. ప్రజల మనస్సులను ఏవిధంగా చూరగొన్నదీ అందరికీ తెలిసినదే. వారు చాల దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించారు. ఈ రోజుకు తనదిగా చెప్పుకొనేది వారికి ఏమీ లేదు. వారి సతీమణి పేర మునిగిపోయే, కొట్టుకుపోయే రెండు ఎకరాల భూమి తప్ప ఇంకేమీ లేదు, అటువంటి మహానాయకుడు మన మధ్యలో లేకపోవడము ఈసభకే కాదు, యావత్తు కూలిజనానికి, రైతులకు అందరికీ తీరని లోటు. ఆ లోటును తీర్చడము చాల కష్టము. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తూ శలవు తీసుకుంటున్నాను.

*పి. రంగారావు (బందరు):—అధ్యక్షా, గుంటూరు బాపనయ్యగారు నాకు 9-20 a. m.
చాల సన్నిహిత మిత్రులు. ఆయన, నేను దివి తాలూకాలో జన్మించాము. మా చిన్నతనములో దివిసీమను అబిసీనియా అనేవారు. ప్రజా ఉద్యమాలలో ఇద్దరము కలిసి పనిచేశాము. నేను ఇక్కడకు కొత్తగా వచ్చిన సభ్యుణ్ణి. వారు నాకు నాకు ఒక మాట చెప్పారు. "రంగారావు గారు, మనము కలిసి పని చేద్దాము. మీరు ఏ విధంగానూ కొత్తవారు అని భయపడనక్కర్లేదు'' అని చెప్పారు. వారు పోవడము అంటే ఒక కుటుంబ సభ్యుణ్ణి కోల్పోయినట్లుగా బాధపడుతున్నాను. వారి మరణానికి నా సానుభూతిని వారి కుంటుంబానికి తెలియచేయాలని కోరుతూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీమతి డి. ఇందిర (తెనాలి):—అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాపతీర్మానమును బలపరుస్తున్నాను. శ్రీ బాపనయ్యగారితో నాపరిచయము స్వల్పమైనా మరవలేని వ్యక్తిగా వున్న మహానుభావుడు ఆయన. తన జీవితకాలమంతా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పాటుపడిన వ్యక్తి నిరాడంబరుడు, నిగర్వి అని తెలుస్తున్నది. నైతిక విలువలకు ప్రాధాన్యము యిచ్చి పేద వర్గాల ప్రతినిధిగా పనిచేసిన వారు. ఆయన శాసన సభ్యునిగా వచ్చిన కొద్ది కాలానికే వారు మనలందరను విడిచి వెళ్ళడము ఎంతో విచారకర

మైనది. వారి మూర్తి మన కనుమరుగైనా వారి కీర్తి ప్రతిష్టలు నిలిచియుంటా యని చెబుతూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ సి.హెచ్. ఎస్. ఆర్. వి. పి. మూర్తిరాజు (తాడేపల్లిగూడెం) :-అధ్యక్షా, ఈనాడు బాపనయ్యగారు మనలను విడిచిపెట్టి వెళ్ళడం చాల దురదృష్టకరము. హృదయముగల మనిషి. ఏ పార్టీలో వున్నా ఇతరుల కోసము తన ప్రాణాన్నిచ్చే స్వభావం గల వ్యక్తి. బాపనయ్యగారిని చూసినపుడు వారు కమ్యూనిస్టు పార్టీ వారని అనుకునేవాణ్ని కాదు. చర్యలు మార్క్సిస్టు పార్టీకి చెందినవైనా వారి హృదయమంతా కాంగ్రెసువైపే వుండేది. వారిని ఎప్పుడు చూసినా ఆనందముతోనే వుండేవారు తప్ప కోపముతో మాట్లాడగా చూడలేదు. ఇక్కడ మనము చాలమందికి సంతాపాన్ని చెబుతూవుంటాము. దానివల్ల వారికి వచ్చేదేమీ లేదు. వారి కుటుంబ పరిస్థితి ఏమి అవుతుందని ఆలోచించేవారు వుంటేనే వారి కుటుంబ జీవితము సుఖమయముగా నడుస్తుంది. దానికి సహాయము చేయవలసినది ప్రభుత్వం కాదు. మన అందరము కలిసి ఏమి చేస్తామనేదాన్నిబట్టి న్యాయము జరుగుతుంది. అధమపక్షము ప్రతివారూ రు. 100 లు అయినా యిస్తే వారి కుటుంబాన్ని శాశ్వతముగా నిలబెట్టినవారమవుతాము. ఆ విధంగా ఇస్తామని శపథం చేయటం మంచిది. అటువంటి సహకారం చేస్తారని నేను నమ్ముతున్నాను. నేను రు. 116 లు యిస్తున్నాను. అందరూ అట్లాగే యిస్తారని ఆశిస్తున్నాను. వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ బాపనయ్యగారి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుతూ శలవు తీసుకొంటున్నాను.

* శ్రీ బి. మచ్చేంద్రరావు (సికింద్రాబాదు - కంటోన్మెంటు ఏరియా) :— అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానమును బలపరుస్తున్నాను. శ్రీ బాపనయ్యగారు పేద కుటుంబంలో జన్మించి యావత్తు జాతికి సేవ చేసిన మరువరాని వ్యక్తి. వారి కుటుంబానికి నా సంతాపమును తెలియజేయాలని చెబుతూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ యమ్. వెంకటేశ్వరరావు (నందిగామ) :—అధ్యక్షా, సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానమును బలపరుస్తున్నాను. శ్రీ బాపనయ్యగారితో వారి 1972 నుంచి పరిచయము. సుమారు 5 1/2 సం. లు వారితో జిల్లా పరిషత్తు సమావేశాల్లో కలిసి పనిచేసే అవకాశం కల్గినది. 1969 లో సైక్లోను వచ్చినపుడు మొన్న వచ్చిన ఉప్పెన సమయములోను వారు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయక పేద

ప్రజలకోసము పని చేసినవారు. వారం, పది రోజులకొకసారి ఇంటికి వెళ్ళేవారు. కాళ్ళు వాచి, నీరు కారుతున్నాకూడ లెక్క చేయక పేదప్రజలకోసము శ్రమించే శ్రమజీవి. మా కృష్ణాజిల్లాలో వారు లేనిలోటు ఎంతో వుంది. ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లుగా బాధ కలుగుతున్నది. కృష్ణా పరిషత్తు సమావేశాల్లో ఒకసారి 1972 లో బడ్జెటులో వున్న తప్పులను తెలియచెప్పేటప్పటికి అందరి సభ్యుల మన్ననలను పొందారు. కృష్ణాజిల్లావాడయినప్పటికి అన్ని ప్రాంతాలు తిరుగుతూ వుండేవారు. సమస్యలను సామరస్యపూర్వకముగా పరిష్కారము చేస్తూ అన్ని ప్రాంతాల ప్రజల మన్ననలను చూరగొన్న వ్యక్తి. అటువంటివారు ఈనాడు మనలో లేకపోవడం చాల విచారకరమైన విషయము. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుతున్నాను.

శ్రీ పోతిన చిన్న (విజయవాడ - పడమర) :— అధ్యక్షా, శాసనసభ్యుడు శ్రీ గుంటూరు బాపనయ్యగారు కాలధర్మము చేసిన సందర్భంలో సభానాయకులు మూవ్ చేసిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఆయన గుణగణాలను గురించి అందరూ తెలియచేశారు. వారు ఏ పార్టీకి చెందినప్పటికి ప్రజాసేవలో నిమగ్నులై నిస్వార్థముతో పనిచేసిన వ్యక్తి. అలాంటి ప్రజా సేవకులు చాలకాలము మనతో వుండాలనే కోరికతో ప్రజలు వున్నపుడు వారికి భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వక తీసుకువెళ్ళడము మంచిది కాదనుకుంటున్నాను. ఇంతకుముందు కాలాలలో యముడు ప్రాణాన్ని తీసుకొని వెడుతున్నపుడు కన్పిస్తూ వుండేవాడని చెబుతూ వుంటారు. అట్లా ఇప్పుడుకూడ కన్పిస్తే బాపనయ్యగారి ప్రాణాలను తీసుకొని వెళ్ళనిచ్చేవారము కాము. బాపనయ్యగారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగచేయాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ వి. శోభనాద్రీశ్వరరావు (ఉయ్యూరు) :— అధ్యక్షా, గుంటూరు బాపనయ్యగారి మరణానికి సంతాపాన్ని తెలుపుతూ సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. ఆయన ప్రజాసేవకు నిర్విరామంగా కృషి చేసిన వ్యక్తి. గత పార్లమెంటు ఎన్నికలలో ఆరోగ్యం పాడైనప్పటికీ మొన్న నవంబరులో తుఫాను వచ్చిన తరువాత తన అనారోగ్యాన్ని కూడా లెక్కపెట్టక పునరావాస సౌకర్యాలు కలుగచేయడంలో ఎంతో కష్టపడ్డారు. కేంద్ర మంత్రులు వచ్చినప్పుడు వారికి విజ్ఞప్తులు అందించడంలో చాలా కష్టపడ్డారు. తుఫాను సందర్భంగా ఇండ్లు పడిపోయిన వారికి గ్రామాలలో డబ్బు అందని వారి గురించి, బియ్యము, గోధుమలు అందటం లేదని, లోగడ జరిగిన అన్యాయాలే తిరిగి ఇంకా జరుగుతున్నాయని కలెక్టరుగారి దృష్టికి తీసుకురావాలని నేను కలెక్టరుగారి వద్దకు వెళ్ళినప్పుడు జ్వరంతో వుండి కూడా బాపనయ్యగారు కూడా అదే విషయాన్ని రిప్రజెంట్ చేయడానికి వచ్చి కలెక్టరుగారి ఆఫీసువద్ద బల్లపై పడుకున్నారు. ప్రజలు యోగ క్షేమాలపై, ప్రజలు కష్టనష్టాలపై వారు ఎంతగానో ఆందోళన పడేవారు. వారు లేని లోటును రాబోయే కాలంతో పూడ్చటం కష్టం. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తున్నాను. 9-30 a.m.

శ్రీ కె. సత్యనారాయణ (రేపల్లె) :—అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్య మంత్రిగారు, ప్రతిపక్ష నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. ఆయన చనిపోయిన సమయంలో ఇక్కడ నేను లేకపోయాను. నెల్లూరులో మహాసభలలో వుండడం వల్ల ఆయన చనిపోయిన తరువాత కూడా ఆయన మృత దేహాన్ని చూడటానికి కూడా అవకాశం లేకుండాపోయింది. ఆయనతో నాకు 32 సంవత్సరాల పరిచయం వుంది. ఆయన మా పార్టీనాయకుడుగా ఎంతో గౌరవం పొందిన వ్యక్తి ఒక కూలీలకే కాకుండా మొత్తం హరిజనులకు ఈనాటి స్థితి నుండి విముక్తి కలిగించాలని, హరిజనులతో ఇతర పేదవారిని కూడా సమీకరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించాలని సుందరయ్యగారితో కలసి కృషి చేసిన మహా వ్యక్తి ఆయన. వ్యవసాయ కార్మికుల హృదయాలలో గౌరవాన్ని సంపాదించిన వ్యక్తి బాపనయ్యగారు, ఆయన ఇతర విషయాలలో ఎంత సౌమ్యుడో రాజకీయ సిద్ధాంతాల విషయాలు వచ్చినప్పుడు ఎట్టి రాజీ లేకుండా తన అభిప్రాయంపై చివరివరకూ నిలబడిన వ్యక్తి కామ్రేడ్ బాపనయ్య. ఆయనకు జోహార్లు అర్పిస్తూ, ఆయన కుటుంబంతో నాకు చనువు వుంది, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియ చేస్తున్నాను.

شری جی - گیان پرکاشم ( دارسی ) :— ادھیکشیه جی - شریمان باپنیا کے سورگباش ھونے پر مجھے گہری چنتا ھے اور ان کے ندھن پر جو پرستاؤ رکھا گیا ھے میں اس کا سمرتھن کرتاھوں اور پرارتھنا کرتاھوں که ایشور انکی آتما کو شانتی دے اور ان کے پریوار کو ھمت دے که وہ اس درگھٹنا کا سامنا کرے۔ شری باپنیا جی ورکنگ کلاس کیلئے زندہ مثال تھے اور مزدوروں کو مندر سمجھنے والے منشیه اس دیس سے چل بسے ھیں۔ ان کے ندھن سے ٹریڈ یونین میں ایک بہت بڑی کمی محسوس کرنے کے دن آئے ھیں - انہوں نے ٹریڈ یونین کیلئے بہت سے کام کئے اور انکے کاموں کو جگت نواسی کبھی نہیں بھولینگے - دھنیه واد —

శ్రీ పి. అప్పారావు (రామచంద్రాపురం) :—అధ్యక్షా, బాపనయ్యగారి గురించి నాకు వివరాలు తెలియవు. ఇక్కడ పెద్దలు చెప్పిన దాన్నిబట్టి వారు మృత జీవులని భావిస్తున్నాను. మరణించినా బ్రతికివున్నట్లే భావిస్తున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియ జేస్తున్నాను.

శ్రీ ఆర్. ఎం. మనోహార్ (అచ్చంపేట) :— అధ్యక్షా, పూజ్యులు ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. బాపనయ్యగారు మన రాష్ట్రానికి గాక మొత్తం భారతదేశానికి సేవచేసినవారు. ఆయన ప్రాణాలు పోయే సమయంలోకూడా ప్రజలకు అపారమైన సేవ చేశారు

To born in a Harijan family is a great thing. He was born through a womb of a Harijan woman, who toiled day and night. A Harijan woman gave birth of a brave son not only of Andhra but the

entire country. He has gone through the tortures throughout his life. That will be remembered for many many years. I am indebted to all friends who have paid tributes to this great son whose aims and objectives are to liberate the thousands and millions of oppressed and suppressed, not only of India but of the entire world. While appreciating the friends' suggestion to provide some financial aid to the family of the brave son, I appeal to our beloved Chief Minister kindly to see that this great family which has shared every minute of tortured life is taken care. I am confident that under the dynamic leadership of our Chief Minister Dr. Channa Reddy, every family that is in trouble and tribulation will receive proper attention from the Government. On behalf of Harijans, weaker sections and minorities, I once again pay tribute ro the great son of Andhra Pradesh, who hand deep sense of service and dedication to the cause of humanity.

I thank you once again, Sir.

శ్రీ ఇ. సుబ్బారావు (కూచనపూడి) :—అధ్యక్షా. గౌరవనీయ ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తూ బాపనయ్యగారితో వున్నటువంటి సంబంధాన్ని పరిచయాన్ని మనవి చేయదలచుకున్నాను. బాపనయ్యగారితో మొట్టమొదటిసారిగా 1962 లో పరిచయం కలిగింది. నేను రెవిన్యూ డిపార్టుమెంటులో ఎల్.డి.సి. గా పని చేసేప్పుడు నన్ను రాజకీయాలలో దింపడానికి కారణం అయినారు బాపనయ్యగారు. వారిని ఎప్పుడు కూడ సంతోష ముఖంతో, చిరునవ్వుతో చూశాను గాని కోపంగా చూడలేదు. వారికి కోపం వచ్చేట్లు మాట్లాడినా కూడ కోపం తెచ్చుకునేవారుకాదు. 9-40 a.m.

He is an embodiment of noble qualities and peace. He is the champion of the poor and down-trodden people. అలాంటి వ్యక్తి యీనాడు మన మధ్యలో లేకుండా పోవడం చాల విచారకరము. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ శ్రీనివాసరావు (నాగరకర్నూల్) :—ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి తీర్మానాన్ని బలపరుస్తూ గుంటూరు బాపనయ్య గారికి జోహార్లు అర్పిస్తున్నాను. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నాను. వారు శ్రమజీవుల సంస్థలనన్నింటిని ఐక్యం చేసి ఆ ఉద్యమాల ద్వారా సమ సమాజాన్ని సామ్యవాద సమాజాన్ని స్థాపించడానికి కృషి చేశారు. వారు శాంతమైనటువంటి మంచితనముతో ఉద్యమాలను నిర్మించి ఆదర్శప్రాయమైనటువంటి జీవితాన్ని గడిపారు. వారి కుటుంబానికి, తప్పకుండా ప్రభుత్వము సానుభూతితో పరిశీలించి, జీవనభృతి కల్పించాలని కోరుతూ, వారి మరణానికి సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతున్నాను.

శ్రీ వి. నారాయణమూర్తి (పెద్దాపురం) :—అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి తీర్మానాన్ని బలపరుస్తూ గుంటూరు బాపనయ్యగారు పేద వర్గాలవారికి, వ్యవసాయ కార్మికుల కొరకు, సామ్యవాద వ్యవస్థ కొరకు అంకితమై జీవితాంతం పని చేసినటువంటి వ్యక్తి అని అటువంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం తీరని లోటు అని చెబుతున్నాను. వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ వి. సుబ్బయ్య (మార్కాపురం) :—అధ్యక్షా, 'జాతస్య మరణం ధృవం' అన్నారు. పుట్టిన వారు గిట్టక తప్పదు. బాపనయ్యగారు వారి జీవిత కాలములో ఏ ఆశయాలకొరకు ప్రజా సేవ కొరకు అంకితం అయ్యారో మన ముందు వుంది. బాపనయ్యగారు మొదటి నుండి దళిత వర్గాలకు కార్మికుల సంఘానికి చేసినటువంటి సేవ మరువరానిది. వారు దళిత వర్గాలకే గాకుండా కమ్యూనిస్టు పార్టి కార్యకర్తగా, నాయకుడుగా ఆంధ్ర దేశ ప్రజల హృదయాలలో వున్నారు. అంతేగాదు, పార్లమెంటరీ, పార్లమెంటేతర కార్యక్రమాలను మేళవించి ఏ ఆశయాలకైతే పోరాడారో ఆ ఆశయాలను చివరకంటా తీసుకువెళ్ళినవారు కామ్రెడ్ బాపనయ్యగారు. మొన్న అసెంబ్లీలో ఆఖరుసారిగా వారి వాణిని విన్పించారు. కృష్ణా జలాలను రాయలసీమకు మళ్ళించాలని, ఆ భోగట్టా అంతా అగ్రిమెంటుతోసహా అసెంబ్లీకి అందజేయాలని చెప్పారు. అదే వారి ఆఖరు మాట, అందువల్ల వారు ఆఖరువరకు కూడ ప్రజా సేవకు అంకితం అయ్యారు. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కొరకు వారు చివరంటా పోరాడుతూ అసువులు బాసినటువంటి మహా నాయకుడు. వారి మరణానికి జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ యన్. వెంకటరత్నం నాయుడు (రాపూరు) :—అధ్యక్షా, సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానముతో ఏకీభవిస్తూ బాపనయ్యగారితో నాకున్న రెండు మూడు సంవత్సరాల పరిచయము గురించి చెబుతాను. వారు ఒక పర్యాయం నెల్లూరు మీదుగా రావడం తటస్థించింది. పీపుల్స్ పాలీ క్లినిక్‌లో కూర్చుని వారు వున్నప్పుడు నేను అక్కడికి వైద్యం కొరకు వెళ్లడం జరిగింది. అక్కడ వున్నటువంటి డాక్టర్సు పరిచయం చేశారు. బాపనయ్యగారిని చూచిన తరువాత అంతకు క్రితం వారిపైన వున్న భావాలు వేరుగా వున్నప్పటికి మార్చుకోక తప్ప లేదు. వారి కార్యక్రమాలు వింటూ వుండేవాడిని. దురుసుగా, గలాభా చేసే మనిషిగా వుంటారేమో అనుకునేవాడిని. కాని చూచిన తర్వాత మూర్తీభవించిన శాంతమూర్తిలాగ వున్నారు. చిరునవ్వుతో పలుకరించారు. ఇక్కడ నేను శాసనసభకు ఎన్నిక అయిన తరువాత బయట రెండు మూడు సార్లు కలుసుకొని మాట్లాడడం జరిగింది. నెల్లూరు విషయాలు హాస్పిటల్ విషయాలు చెప్పారు. మొన్న జబ్బు చేసినప్పుడు ఇక్కడ వెనకాల బెంచీలో కూర్చొని వున్నారు. ఓంకార్ గారు వచ్చి గవర్నరుగారి ప్రసంగం మీద మాట్లాడుతారా అని అడిగినప్పుడు నేను తయారు అయి రాలేదనే సంకోచాన్ని వెలిబుచ్చితే మీరు తయారు

కావడం ఏమిటీ ఎప్పుడూ ప్రజా సమస్యలలో నిమగ్నమై వుండేవారు అని చెప్పడం జరిగింది. అయితే వారికి అవకాశం రాలేదు, వారు మాట్లాడ లేదు. కాస్త బి. పి. వచ్చినట్లుంది అని చెప్పినప్పుడు నేను వెనుకాల వస్తానని అంటే బయట వేరే వారు వున్నారని చెప్పారు. అదే వారు ఆఖరుసారిగా చెప్పడం జరిగింది. రాష్ట్రానికి ప్రజలకు వారు చేసినటువంటి సేవ మరిచిపోడానికి లేదు. అటువంటి మహా మనిషి యీ సభలో లేకపోవడం నిజంగా కొరత. మూర్తిరాజుగారు చెప్పినట్లు వారికి ఆర్థిక సహాయం అందించవలసిన అవసరం ఎంతైనా వుంది. వారి కుటుంబ సంగతి నాకు తెలుసు. నేను వారి కుటుంబానికి వంద రూపాయల సహాయం అందజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలుగాలని చెబుతూ వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. శ్రీరామమూర్తి (ఆమదాలవలస) :— అధ్యక్షా, గుంటూరు బాపనయ్యగారితో నాకు చాలా తక్కువ పరిచయం వున్నప్పటికి గత శాసనసభ టైములో మేము కమిటీల్లో వున్నప్పుడు—వారు అప్పుడు శాసన మండలి సభ్యులుగా వున్నారు. వారు నేను కలిసి పని చేయడం జరిగింది. వారి భావాలు వారి మనస్సు చూస్తే ప్రజాహిత కార్యక్రమాల్లో ఎంత చక్కగా పాల్గొని సామాన్య ప్రజానికానికి సేవ చేసేవారో తెలుస్తుంది. వారి మరణం ఆంధ్రదేశ ప్రజలకు తీరని లోటు అని భావిస్తూ వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరుతున్నాను.

శ్రీ కె. నరసయ్య (ఎచ్చెర్ల) :— అధ్యక్షా, సోదరులు గుంటూరు బాపనయ్య గారి అకాల మరణం పట్ల సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. అధ్యక్షా, వీరి మరణ వార్త నాకు దిగ్భ్రాంతి కలుగజేసింది. వారు సౌమ్యులు, సహృదయులు. ప్రముఖ హరిజన నాయకులు. వీరు దేశ సేవతోబాటు దళిత, బడుగు ప్రజలయొక్క శ్రేయస్సుకోసం అహర్నిశలు పాటు పడిన సేవాపరులుగా పేరుకెక్కారు. వారు కూర్మయ్య, బి. ఎస్. మూర్తిగారల కోవకు చెందినటువంటివారు. వీరు మంచి నీతి నిజాయితీపరులు వీరు ఎల్లప్పుడు నీతినిజాయితీతో బ్రతికి ఇతర దేశాలకు ఆదర్శప్రాయంగా ఎందుకు ఉండకూడదనే టటువంటి అభిప్రాయముగల ప్రముఖ నాయకులు. ఈవేళ వారు స్వర్గస్థులు కావడం చాలా విచారకరమైన విషయం. వారి మరణంవల్ల ముఖ్యంగా బడుగు ప్రజలకు, దళిత ప్రజలకు తీవ్రమైనటువంటి అఘాతం ఏర్పడిందని నేను భావిస్తు న్నాను. ఈ కొరత తీర్చుకొనుటకు చాలా కాలం పడుతుందని కూడా భావిస్తు న్నాను. తమ ద్వారా వీరి కుటుంబానికి నా హృదయపూర్వకమైన సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను. 9-50 a.m.

మిస్టర్ స్పీకర్ :— మన శాసనసభ్యులైన శ్రీ గుంటూరు బాపనయ్యగారు నాకు చిరపరిచితులు. శాసనమండలిలో కలసి పని చేసేటటువంటి అవకాశం నాకు దక్కింది. నాకు చాలా సన్నిహితమైన మిత్రులు. శ్రీ బాపనయ్య వివాదాస్పద మయిన సమయాలలో మాట్లాడుతున్నప్పటికి చాలా ప్రశాంతంగా, చిరునవ్వుతో

మాట్లాడేవారు, వినయము, కారుణ్య బుద్ధి, వివేక లక్షణాది గుణాలకు ఆటకట్టు అయినటువంటివారు ఆయన. అటువంటి మిత్రుడుని కోల్పోవడం నాకు వ్యక్తిగతంగా చాలా విచారకరంగా ఉంది. వారు ఇంత త్వరలో మనలను వదిలిపెట్టి వెళ్ళిపోతారని ఎవరూ అనుకోలేదు. వారి అకాల మరణానికి నాకు చాలా బాధగా ఉంది. సభానాయకులు, ఇతర నాయకులు, గౌరవనీయులైన సభ్యులు వెలిబుచ్చిన బాధాకరమైన భావాలతో ఏకీభవిస్తున్నాను. వారి ఆత్మశాంతి కోసం, వారి గౌరవార్థం మనమందరం 2 నిముషాలు నిలబడి మౌనం వహిద్దాము.

The question is :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Gunturu Bapanaiah, a Member of the A.P. Legislative Assembly and conveys its sense of sympathy to the members of the bereaved family."

(సభ్యులందరు నిలబడి రెండు నిమిషములు మౌనం వహించిరి)

9-55 a.m. మిస్టర్ స్పీకర్ :—తీర్మానం అందరూ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నారని వారి మృతికి సంతాప సూచకంగా ఈ సభను ఈరోజుకు వాయిదా వేస్తున్నాను. ఈ సభ తిరిగి రేపు ఉదయం గం. 8-30 లకు సమావేశమవుతుంది.

(The House then adjourned to meet again at 8-30 a.m. on Tuesday the 28th March, 1978.)

—